క్లుప్తంగా

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనలు



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైస్ ఎంపీపీ వర్షిణి

రాజాం: విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేసిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు రాజాం వైస్ ఎంపీపీ నక్క వర్షిణి శుభాకాంక్షలు తెలిపారు. అమరావతిలో బొత్సను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన

రేగిడి: రైతులు సాగు చేస్తున్న పంటలకు సేంద్రియ ఎరువులు వేస్తే దిగుబడులు అధికంగా వస్తాయని ప్రకృతి వ్యవసాయం ఎల్–2 గౌరీశంకర్ సూచించారు. మండలంలో అక్కన్నఅగ్రహారం, ఉప్పర్నాయుడువలస గ్రామాల్లో రైతులకు సేంద్రియ ఎరువులతో సాగుపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు ఎక్కువగా వినియోగించడం వలన పంటలు తెగుళ్ల బారిన పడడంతో దిగుబడులు తగ్గుతాయని పేర్కొన్నారు. రైతులు ప్రకృతి, సేంద్రియ పద్ధతులు పాటించాలని అన్నారు. ఐసీఆర్పీలు తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

'భోజనం' బాగుండాలి



వంటకాలు రుచి చూస్తున్న ఎంఈఓ

వంగర: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం వంటకాలు రుచిగా ఉండాలని ఎంఈఓ వై.దుర్గారావు అన్నారు. మండల పరిధి ఎం.సీతారాంపురం ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.సుందరీమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థినులకు సూచనలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: కస్తూర్బా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినిలు మంచిగా చదివి ఉన్నతంగా ఎదగాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు అన్నారు. దేవుదళ కస్తూర్బా పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రిన్సిపాల్ లక్ష్మికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వెల్లడించారు.


బాలికలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

రేగిడి: కిశోర బాలికలు ఆరోగ జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ రేగిడి సెక్టార్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కిశోర బాలికలకు ఆరోగ్య సూత్రాలపై గురువారం అవగాహన కల్పించారు. ఒత్తిడిని అధిగమించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై పలు సూచనలు చేశారు. పోషకాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతకు తీసుకోవల్సిన జాగ్రత్తలు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ ఉద్యోగులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగావళిలో పెరిగిన ప్రవాహం



సంకిలి వద్ద నాగావళిలో నీటి ప్రవాహం

రేగిడి: నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. ఇటీవల కురుస్తున్న వర్షాల నీరుతో పాటు మడ్డువలస ప్రాజెక్ట్ నీరు గేట్లు ద్వారా విడిచిపెట్టడంతో నదిలో చేరుతుంది. పలుచోట్ల నది ఉధృతంగా ప్రవహించి, ఓపెన్‌హెడ్ చానల్‌కు నీరు అందుతుంది.

బిక్కుబిక్కుమంటూ విధులు

- ఆస్పత్రుల్లో అరకొర సౌకర్యాలు
- విధుల్లో రాత్రి పూట భయమే...



ఒకే గదిలో విధుల్లో నలుగురు డాక్టర్లు

బొబ్బిలి: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్యుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. పేరుకే వైద్యులు కానీ వారి కష్టాలు వర్ణనాతీతం. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆస్పత్రిలో రోగులకు చికిత్స అందించే వైద్యులు, సిబ్బంది రాత్రిళ్లు నరకం చూస్తున్నారు. ఇక్కడి ఆస్పత్రిలో కనీసం దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు లేవని వాపోతున్నారు. ఒక్కోసారి ముగ్గురు, నలుగురు ఒకే గదిలో వేర్వేరు రోగులకు చికిత్సలను అందించాల్సి వస్తుందంటున్నారు. ప్రశాంతంగా రోగి రోగాన్ని పసిగట్టే పరిస్థితులు కూడా ఉండడం లేదని వాపోతున్నారు. పగటిపూట సిబ్బంది అందరూ ఉంటారు గనుక కాస్త ఊరటగా ఉన్నా రాత్రి పూట 24గంటల డ్యూటీలో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తామని మహిళా వైద్యులు, సిబ్బంది చెబుతున్నారు. రాత్రిపూట ఎక్కువగా వచ్చే ప్రమాదాల కేసులలో వచ్చే రోగులకు చికిత్సను అందించడమంటే కత్తిమీద సామేనని వారు పేర్కొంటున్నారు. మద్యం, గంజాయి తాగి వచ్చి నానా దుర్భాషలు ఆడుతారని, తలుపులు తడుతూ పెద్దపెద్ద కేకలు వేస్తు భయభ్రాంతులకు గురి చేస్తుంటారని తెలిపారు. రోగులతో సమస్య లేకున్నా వారితో పాటు వచ్చే వారు మమ్మల్ని కనీసం మనుషుల్లా గుర్తించరని, కొందరైతే ఎవడి కోసం చేయవు అంటూ గద్దిస్తారని వాపోతున్నారు. చికిత్సను చేసే సమయం కూడా ఇవ్వకుండా మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తుంటారని అందుకే రాత్రిపూట విధులు నిర్వహించాలంటే బిక్కుబిక్కుమనాల్సిందేనంటున్నారు. రాత్రిళ్లు ప్రత్యేకంగా పోలీసుల రక్షణ అవసరమైనా ఇక్కడ ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు వైద్యులు, సిబ్బంది.

రక్షణ కల్పించాలి



డాక్టర్ సౌజన్య, సీహెచ్‌సీ, బొబ్బిలి

రాత్రిపూట ఉద్యోగం భయంతోనే చేస్తాం. రాత్రిపూట వచ్చే ఎక్కువ కేసులు ప్రమాదాలు, మద్యం, గంజాయి వంటివి సేవించి వచ్చేవారివే ఎక్కువ. వారితో పాటు వచ్చేవారి హడావుడి, కేకలు అంతాఇంతా కాదు. నేరుగా గదికి వచ్చి తలుపులు బాదుతారు. వెంటనే చికిత్స చేయాలంటారు. పోలీసులకు తెలియజేయండి అంటే మామీద తిరగబడతారు. ఒక్కోసారి కొందరు కొట్టేంత పని చేస్తారు.ఇలాంటి సంఘటనలతో ఎందుకు ఈ ఉద్యోగం చేయాలి అనుకుంటాం. ఏది ఏమైన రాత్రిళ్లు ఆస్పత్రి వద్ద పోలీసులతో రక్షణ కల్పించాలి. కోల్‌కత్తాలో జరిగిన సంఘటనతో మరింత ఆందోళన చెందుతున్నాం.

చర్యలు చేపట్టాలి



రెడ్డి స్వాతి, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ, బొబ్బిలి

బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేకమైన గది అంటూ ఏమీ లేదు. రోగులను బయట ఉంచి తలుపు లేసుకునే ఇదే గదిలోనే దుస్తులు మార్చుకోవాల్సి వస్తుంది. చిన్నచిన్న గదుల్లో వైద్యులంతా ఒకేచోట చికిత్సలను అందించడం అంటే ఇబ్బందికరంగా ఉంటోంది. ఇక రాత్రిపూట విధులు నిర్వర్తించాలంటే హడలెత్తిపోతాం. ఒక్క సెక్యూరిటీ గార్డు ఆస్పత్రి మొత్తాన్ని చూసుకోవాలి. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే ఎవరూ అందుబాటులో ఉండరు. నెలలో 4 రోజులు నైట్ డ్యూటీలు చేస్తాం. అప్పుడు వచ్చే కేసుల్లో ఎక్కువమంది మద్యం సేవించే వస్తారు. వారిని కట్టడి చేయాలంటే ఒక్క సెక్యూరిటీగార్డు చాలదు. మాకు, సిబ్బందికి సెక్యూరిటీ కల్పించాలి.

సమస్యల పరిష్కారానికే వార్డు సందర్శన



వార్డులో సమస్యలను వింటున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకే వార్డు సందర్శన కార్యక్రమాన్ని చేపట్టామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని 3వ వార్డు పరిధిలో సంఘవీధి, రెల్లివీధి, చాకలివీధుల్లో వార్డు సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వీధుల్లో సమస్యలను ప్రజలు కమిషనర్ తెలియజేశారు. చాకలి వీధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కుళాయి కనెక్షన్లను ఇప్పించాలని కోరారు. వీధి దీపాలు, కాలువలపై పలకలు వేయించాలని విన్నవించారు. త్వరలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



రోగులకు కంటి పరీక్షలు

రాజాం: రాజాం మున్సిపాల్టీ పరిధిలో గాంధీనగర్ సీతారామా థియేటర్ సమీపంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయనగరానికి చెందిన శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల రాజాం సంఘం ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 85 మందికి కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరికి ఆప్తాలమిక్ అధికారి సౌజన్య, అసిస్టెంట్ హేమలు వైద్య తనిఖీలు నిర్వహించారు. 29 మందిని ఉచిత కంటి ఆపరేషన్లుకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. క్యాంపు కోఆర్డినేటర్ భీమశంకర్, స్టాప్ నర్సు నాగమణి, ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల రాజాం సంఘ అధ్యక్షుడు ఎన్.గౌరీశంకరరావు, ప్రధాన కార్యదర్శి డి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంపై దర్యాప్తు చేపట్టాలి



పట్టణంలో నిరసన వ్యక్తం చేస్తున్న కళాసీ సంఘం ప్రతినిధులు

బొబ్బిలి: అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో బుధవారం జరిగిన ప్రమాదంపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పట్టణకళాసీ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. పట్టణంలో ఎన్టీఆర్ కూడలి వద్ద గురువారం నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇటువంటి ప్రమాదాలు అక్కడ తరచూ జరుగుతున్నాయని, కంటితుడుపు చర్యలతోనే పునరావృతం అవుతున్నాయని విమర్శించారు. బుధవారం జరిగిన ప్రమాదంలో 17 మంది మత్యువాత పడగా 60 మంది క్షతగాత్రులుగా మిగిలారని వారందరికీ మెరుగైన నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడే ప్రభుత్వాలు హడావుడి చేస్తాయి తప్ప తదనంతరం అక్కడి పరిస్థితులపై చర్యలు తీసుకునేదే లేదన్నారు. లాభాలపై ఉన్న శ్రద్ధ ప్రమాదాల నివారణకు, రక్షణ చర్యలు యాజమాన్యాలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. అచ్చుతాపురం, పరవాడ సెజ్‌లలో 398 కంపెనీల్లో తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బోగాది అప్పలస్వామి, వై.అప్పారావు, పి.రామకృష్ణ, గోపి, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న టీసీ

బొబ్బిలిరూరల్: గ్రామాల్లోని సాగునీటి వనరుల్లో చేపలు, రొయ్యిలను సాగు చేస్తున్న రైతులు శిక్షణ ద్వారా మెలకువలను నేర్చుకోవాలని మత్స్యశాఖ టెక్నికల్ కన్సల్టెంట్ ఎన్.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కారాడ గ్రామంలో జాతీయ జలకృషి, సుస్థిర కేంద్రం ఆధ్వర్యంలో 5రోజుల శిక్షణలో భాగంగా 3వ రోజు గురువారం చేపల, రొయ్యిల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. మెరుగైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడిని సాధించవచ్చని ఆయన రైతులకు తెలిపారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాలైన సహాయ సహకారాలను అందిస్తామని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ మేనేజర్ రాము, విలేజ్ ఫీల్డ్ అసిస్టెంట్ సిహెచ్.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

సచివాలయంలో శునకాల సంచారం

రాజాం :

మున్సిపాల్టీ పరిధిలో బుచ్చింపేట వార్డు సచివాలయం శునకాల నిలయంగా మారుతుంది. సచివాలయ పని సమయాల్లో ఉద్యోగులు సైతం వీటిని పట్టించుకోవడం లేదు. దీంతో ఇవి విచ్చలవిడిగా సచివాలయంలో సంచరిస్తున్నాయి. గురువారం సచివాలయం తెరిచి ఉన్నప్పటికీ శునకాలు సంచరించి, ప్రజలను ఇబ్బందులకు గురి చేశాయి. వీటి సంచారంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే వారు భయాందోళనలు చెందుతున్నారు.



బుచ్చింపేట సచివాలయంలో నిద్రిస్తున్న శునకం

ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులకు శిక్షణ

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 3నెలల కాలవ్యవధిలో పీఎంకేవీవై పథకం ద్వారా స్వల్పకాలిక టెక్నికల్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ జీవి.రమణ గురువారం తెలిపారు. పదో తరగతి పాసైన, ఫెయిలైన అభ్యర్థులు అర్హులని, శిక్షణా సమయంలో ఉచిత బస్సు సౌకర్యం ఉంటుందని, ఆసక్తిగల అభ్యర్థులు తమ అర్హత ధ్రువపత్రాలతో సంప్రదించాలని తెలిపారు.

వంట గదులు పరిశుభ్రంగా ఉంచాలి



వంటలను రుచి చూస్తున్న ఎంఈఓ

బొబ్బిలి రూరల్: విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని సరిపడ వడ్డించాలని, వంటచేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలని ఎంఈఓ జి.వాసు సూచించారు. మండలంలోని గున్నతోటవలస ఎంపీపీ పాఠశాలలో భోజనాల వంటలను గురువారం ఆయన పరిశీలించారు. వంటల రుచిచూసి సంతృప్తి వ్యక్తంచేశారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

రేగిడి: మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో మరమ్మతులకు గురైన బోర్లను బాగు చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ అన్నారు. సంకిలి, అక్కన్నఅగ్రహారం, చిన్నయ్యపేట, బొడ్డవలస గ్రామాల్లో తాగునీటి బోర్లను గురువారం బాగు చేశారు. బోర్ల మరమ్మతులకు అవసరమైన వస్తు సామగ్రి పంచాయతీలకు అందించామని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలోనే ఇసుక స్లాట్ బుక్ చేసుకోవాలి



ఇసుక స్టాక్ పాయింట్ వద్ద లారీల యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్, సీఐ

బొబ్బిలి: స్థానికేతరులకు ఇసుకను తరలిస్తే ఉపేక్షించేది లేదని, కేవలం జిల్లా పరిధిలోమాత్రమే ఇసుక రవాణా జరగాలని తహసీల్దార్ ఎం.శ్రీను ఆదేశాలు జారీ చేశారు. గ్రోత్‌సెంటర్‌లోని ఇసుక స్టాక్ పాయింట్‌ను గురువారం ఆయన పరిశీలించారు. పెద్ద ఎత్తున వెయిటింగ్‌లో ఉన్న ఇతర ప్రాంతాల లారీలను సీఐ సతీష్ ద్వారా ఖాళీ చేయించారు. ఇసుక స్టాక్ పాయింట్ సూపర్‌వైజర్లకు పలు ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక విధానానికి సంబంధించి ఇసుక ఎవరికి కావాలో, ఏ ప్రాంతానికి, ఏ అవసరాలకి కావాలో వంటి ధ్రువపత్రాలను అందజేయాలని, ఇక్కడ నుంచే ఇసుక స్లాట్‌లను బుక్ చేసుకోవాలని సూచించారు. అక్కడ వెయిటింగ్‌లో ఉన్న సుమారు 80 లారీలను పంపించేశారు. ప్రభుత్వం జారీ చేసే విధివిధానాల ప్రకారమే ఇసుక పంపిణీ, రవాణా ఉంటుందని చెప్పారు.

'ఉపాధి' గ్రామసభలు పక్కాగా నిర్వహించాలి

తెర్లాం: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనుల గుర్తింపు గ్రామసభలను పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి క్షేత్ర సహాయకులు పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను శుక్రవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గ్రామసభలకు స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధి వేతనదారులు, ప్రజలు హాజరుకావాలన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన వేతనదారులు చేయాల్సిన పనులతో పాటు, సీసీ రోడ్లు, కాలువలు, బీటీ రోడ్లు తదితర పనులకు సంబంధించి దరఖాస్తులు గ్రామసభలో అందజేయాలన్నారు. గ్రామసభలను మండల నోడల్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు పర్యవేక్షిస్తారని తెలిపారు.

సంతకవిటిలో...

సంతకవిటి: మండల పరిధిలోని 34 పంచాయతీలలో శుక్రవారం ఉపాధి హామీ పనులు గుర్తింపు కోసం సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జి.వి.రవికుమార్ గురువారం తెలిపారు. మందరాడ, బిల్లాని గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటలకు మిగిలిన పంచాయతీలలో ఉదయం 10 గంటలకు గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామ సభలు నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధిహామీ సిబ్బందితో కలిపి గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ హరనాథ్‌పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజాం: ఖరీఫ్ వరి సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు దేవుడిబాబు, ఎం.సంతోష్ అన్నారు. మండలం మారేదుబాక గ్రామంలో రైతులతో వరి పంటలో కలుపు నివారణ, ఎరువుల యాజమాన్యం, పురుగు, తెగుళ్ల నివారణపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉడుపు చేసి వరిలో కలుపు నివారణ, వర్షాల వలన కలుపు సమస్య, వాటి నివారణపై సూచనలు అందించారు. ఖరీఫ్ ఉడుపులో చదరపు మీటరకు 44 మొనలు ఉండేలా చూసుకోవాలని వెల్లడించారు. వరినాట్లు నాటిన తర్వాత ప్రతీ రెండు మీటర్లుకు 20 సెంటిమీటర్లు బాటలు తీయడం వలన పైరుకు గాలి, వెలుతురు తగిలి పంట బాగా పెరుగుతుందని, చీడపీడల వ్యాప్తి తక్కువగా ఉంటుందని అన్నారు. ఎరువులు, కలుపు మందులు వేసేందుకు అనువుగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోతే చర్యలు



జె.కొత్తవలస పాఠశాలలో మరుగుదొడ్లు పరిశీలిస్తున్న ఎంఈఓ

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోతే సంబంధిత స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకొనేందుకు వెనుకాడేది లేదని ఎంఈఓ జె.త్రినాధరావు అన్నారు. మండలంలోని పూనువలస పంచాయతీ పరిధిలోని జె.కొత్తవలస ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని విద్యార్థులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటానని స్కావెంజర్‌ను హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి రుచికరంగా విద్యార్థులు భోజనాలు వండిపెట్టాలని నిర్వాహకులకు ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, పాఠశాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

రాళ్లు తేలిన రహదారిలో అవస్థలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బొడ్డవలస పంచాయతీ పరిధిలోని నిమ్మలపాడు, చెల్లివలస, కొయ్యికొండవలస గిరిజన గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. పెద్దపెద్ద కొండరాళ్లు దారిపై తేలి దర్శనమిస్తాయి. దీంతో ఈ మార్గంలో పాదచారులు సైతం అవస్థలు పడుతున్నారు. అత్యవసర వైద్య సదుపాయం అవసరమయితే ఈ రహదారి మరింత ప్రమాదకరంగా మారుతోందని ఆయా గిరిజన గ్రామాల ప్రజలు చెబుతున్నారు.



రాళ్లు తేలిన రహదారిపై ప్రయాణం చేస్తున్న గ్రామస్తులు

ఈ–పంట నమోదు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎస్‌కే రాజు

రాజాం సిటీ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ పంట నమోదు వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎస్‌కె.రాజు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఏఏలు, వ్యవసాయ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటి వరకు ఎంత నమోదు చేశారు, ఇంకా ఎంత చేయాల్సి ఉందనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి ఈ – పంట నమోదు తప్పనిసరిగా చేయాలని సూచించారు. వీఏఏలంతా రైతులకు అందుబాటులో ఉండాలని, పంటలకు సంబంధించి అడిగిన సలహాలు సూచనలు అందించాలని తెలిపారు. ఏఓ ఎం.రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

ఆయాల ఆకలి కేకలు

- ప్రభుత్వ బడుల్లో ఆయాలు, వాచ్‌మెన్‌లకు అందని జీతాలు



రామభద్రపురం చౌక్కాపు వీధి పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రపరుస్తున్న ఆయా

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్‌లకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జీతాలు అందకపోవడంతో పూట గడవక వారి కుటుంబాలు అవస్థలు పడుతున్నారు. నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆకలితో అల్లాడుతున్నారు. మండలంలోని 57 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో 58 మంది ఆయాలు, ఐదుగురు వాచ్‌మెన్‌లు పని చేస్తున్నారు. వీరంతా పొట్ట కూటి కోసం ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్యం పనులకు చేరినా సక్రమంగా జీతాలు ఇవ్వకుండా చూపిస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని, అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని వాపోతున్నారు. జీతాలు పెండింగ్ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పెండింగ్‌లో ఉన్న జీతాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈఓ తిరుమలప్రసాద్‌ను వివరణ కోరగా ఆయాలు, వాచ్‌మెన్ల జీతాలు పెండింగ్‌లో ఉండడం వాస్తవమేనని, ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టామని తెలిపారు.